క్లుప్తంగా

ఆలయానికి విరాళం

నవాబుపేట: తూక్యాతండాలో నూతనంగా నిర్మించే హనుమాన్ ఆలయానికి.. యన్మన్‌గండ్ల గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి విరాళం ప్రకటించారు. ఆదివారం తండాకు చెందిన యువకులకు ఆయన రూ. 75 వేల నగదును అందించారు. అభివృద్ధిలో సైతం తనవంతుగా సహకారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రాంచంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన చెన్నయ్య అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం బీజేపీ నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. చెన్నయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. మున్నూర్ రాజు, రమేష్, కొండన్న, పాపన్న, పిల్లి శ్రీను, బుచ్చన్న, శివాజీ, కాశన్న, కొండన్న తదితరులు ఉన్నారు.

విద్యా సామగ్రి అందజేత

నవాబుపేట: మండల పరిధిలోని కూచూర్‌కి చెందిన ఎంపీటీసీ సభ్యుడు భోజయ్యచారి ఆదివారం అనాథ విద్యార్థులకు చేయూత నందించేందుకు ముందుకు వచ్చారు. మండల కేంద్రంలో కేజీబీవీలో చదువుతున్న కూచూర్‌కు చెందిన విద్యార్థులకు ఆయన బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు తదితర వాటిని అందించారు.

ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నాగయ్య, పీఈటీ నిరంజన్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.హన్సిక, డి.నవీన్‌కుమార్‌లు ఎంపికైనట్లు వివరించారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.12వేల స్కాలర్‌షిప్ అందుతుందని పేర్కొన్నారు. ఇద్దరు విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



హన్వాడ: రైతుల రుణాలను ఒకే విడతలో మాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తూ మండల కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఒకే విడతలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం సాహసోపేత నిర్ణయమని అన్నారు. గతంలో వైఎస్సార్, నేడు సీఎం రేవంత్‌రెడ్డికే ఈఘనత దక్కిందని పార్టీ జిల్లా కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్ పేర్కొన్నారు. మండల నాయకులు షబ్బీర్, సుధాకర్, మాజీ ఎంపీటీసి శ్రీనివాసులు, బొక్కిరాములు, సుధాకర్, నరేందర్, చంద్రశేఖర్‌గౌడ్, గోపాల్‌గౌడ్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జానంపేటలోనూ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బగ్గి కృష్ణయ్య, గోవర్ధన్, యాట సత్యం, సురేష్, కృష్ణయ్య, యాదయ్య, తిరుపతయ్యగౌడ్, మహేందర్, శ్రీనివాస్‌శర్మ, రాంచందర్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని బొక్కలోనిపల్లి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, మాజీ సర్పంచ్ గోవింద్‌యాదవ్, నాయకులు రంగయ్య, సుధాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, శేఖర్‌రెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, యాదయ్య, నాగయ్య, సత్యనారాయణ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

జడ్చర్ల టౌన్: భారత్‌సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఎంఈఓ మంజులాదేవి ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, తదితరులు హాజరవుతారని వెల్లడించారు. అదేవిధంగా నోట్ పుస్తకాల పంపిణీలో జెడ్పీహైస్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు సైతం పాల్గొంటారని ఆమె వివరించారు.



బురదమయంగా మారిన సోమ్లాతండా రోడ్డు



అధ్వానంగా నర్సింగ్ తండారోడ్డు

తండాలకు రోడ్ల తంటా..

వర్షాకాలం మట్టిరోడ్లతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులు

ప్రభుత్వాలు పాలకులు మారుతున్నా తమ తండాలకు మట్టి రోడ్లతో అవస్థలు తప్పడం లేదంటున్నారు మండల పరిధిలోని గిరిజనులు. ఏళ్లుగా అవస్థలు పడుతున్నా పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా తమ తండాలకు వెళ్లే దారుల రూపురేఖలు మారడం లేదని, ఇప్పటికీ గుంతలు పడిన మట్టి రోడ్లతోనే సావాసం చేస్తున్నామని వాపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని బీబీనగర్, సోమ్లాతండా, నర్సింగ్‌తండా, ప్రేమ్‌లీతండా, వాచ్యతండా, బల్లీతండా, సేవ్యాతండా తదితరాలకు బీటీరోడ్డు లేదు. దీంతో అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా వర్షాకాలం వస్తే పరిస్థితి మరీ ఘోరంగా ఉంటోంది. దారులన్నీ బురదమయంగా మారడంతో పాటు గుంతల్లో నీళ్లు నిలవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి బీటీరోడ్లు వేయాలని కోరుతున్నారు.

రాజాపూర్



వాచ్యాతండా రోడ్డు పరిస్థితి ఇలా..

ప్రయాణమంటేనే నరకయాతన..

మా నర్సింగ్‌తండా నుంచి ప్రతిరోజు వివిధ పనులపై రాజాపూర్ మండల కేంద్రానికి వెళ్తుంటాం. తండాకు వచ్చేందుకు ఉన్న మట్టిరోడ్డుకు ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన మెటల్‌రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలింది. ఆ కంకరరోడ్డుపై వెళ్తుంటే వాహనాలు దెబ్బతింటున్నాయి. చాలామంది ప్రమాదాలకు గురై అవస్థలు పడుతున్నారు. బీఆర్‌ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చే ఇప్పుడైనా రోడ్డువేస్తే బాగుంటుంది.

– సుగుణ నర్సింగ్‌తండా, రాజాపూర్ మండలం

అవస్థలు పడుతున్నాం

మా తండాకు రోడ్డు సౌకర్యం అధ్వానంగా ఉండటంతో తండా నుంచి రాజాపూర్, మల్లేపల్లి గ్రామాలకు వెళ్లాలన్నా ఆటోవాళ్లు కూడా రావడం లేదు. ఓట్లప్పుడు వచ్చిన నాయకులు రోడ్డు సంగతి అడిగితే చేస్తామంటారుకానీ ఇంతవరకు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

– రుక్కమ్మ, సోమ్లాతండా

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న జంగయ్య

జడ్చర్ల టౌన్: ఎన్నికలకు ముందు దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు కాలె జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించిన వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. రూ.6వేలకు పింఛన్ పెంచటం వల్ల సమాజంలో గౌరవంగా బతకటానికి వీలవుతుందన్నారు. ఒకరిపై ఆధారపడకుండా తమంతకు తామే బతికేందుకు అవకాశం కల్పించినట్లవుతారన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం తమ సమితి కృషిచేస్తుందని, ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రభుత్వ ముందుకు రావాలని, డబుల్‌బెడ్‌రూంల కేటాయింపులో తగిన వాటా ఇవ్వాలని, ప్రభుత్వం ప్రకటించినట్లుగా ఇంటిస్థలంతోపాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలను ఇచ్చే విషయంలోనూ దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ విషయంలో అవసరమైతే మంత్రులతోపాటు సీఎంను కలసి సమస్యలను విన్నవిస్తామన్నారు. సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు అందె రాంబాబు, తెలంగాణ వికలాంగుల వేదిక మహిళా అధ్యక్షురాలు లలిత, జిల్లా నాయకులు చెన్నకేశవరెడ్డి, బిచ్యునాయక్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, పద్మ పాల్గొన్నారు.

స్విచ్‌లు ఏర్పాటు చేయాలి

రాజాపూర్: గ్రామాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు లేకపోవడంతో తరచూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్‌శాఖ స్విచ్‌ల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని..చాలావరకు గ్రామాల్లో ఏబీ స్విచ్‌లు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. సాధారణంగా గ్రామంలో ఏదైన విద్యుత్ సమస్య ఏర్పడితే సబ్‌స్టేషన్ నుంచి లైన్‌క్లియర్ తీసుకుంటేనే .. సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. ఏబీ స్విచ్ లేని కారణంగా గతకొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొక తప్పడంలేదు. నిబంధనల ప్రకారం కచ్చితంగా స్విచ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్న ఎక్కడా చర్యలు చేపడుతున్నా దాఖలాలు కనిపించడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



రాయపల్లిలో పరిస్థితి ఇలా..

లీగల్ సెల్ కన్వీనర్‌గా రాఘవేందర్‌రెడ్డి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్‌గా కోయల్‌కొండ మండల్, గార్లపహాడ్‌కు చెందిన తూర్పు రాఘవేందర్‌రెడ్డిని నియమించారు. ఇందుకు సంబంధించిన నియామకపత్రాన్ని లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్, రాఘవేందర్‌రెడ్డికి హైదరాబాద్‌లో అందించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి లీగల్‌సెల్ కన్వీనర్‌గా నియమించినందుకు రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

పారదర్శకంగా బదిలీలు, పదోన్నతులు

స్టేషన్ మహబూబ్‌నగర్: గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర సృష్టించారని.. తెలంగాణ ఆల్‌మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్య వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిందన్నారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే సీఎం వేలాది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల ఉన్నతీకరణను చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటుండడం అభినందనీయమని అన్నారు.

ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన ఎంపీపీ దోనూరు నాగార్జున్‌రెడ్డి తండ్రి దోనూరు వెంకటరామారెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. వెంకటరామారెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఏపీ.జితేందర్‌రెడ్డి కుమారుడు ఏపీ.మిథున్‌రెడ్డి కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా జానంపేటలో నక్క వెంకటయ్య దశదినకర్మలో ఎమ్మెల్యే పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండలాధ్యక్షులు తోట శ్రీహరి, శెట్టిశేఖర్, నాయకులు బగ్గి కృష్ణయ్య, డీఎల్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, జగదీశ్వర్, హేమవర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, వేణునాథ్, బుచ్చన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

నవాబుపేట: బోయినిపల్లికి చెందిన బీర్ల శేఖర్ (40) కొన్ని రోజుల క్రితం గ్రామంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కాగా ఆదివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మండల నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కొంత నగదును తక్షణ సాయంగా అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.



ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

హన్వాడ: మండలకేంద్రంలో ఆదివారం కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దళితుల పట్ల ఇప్పటికీ వివక్షలు కొనసాగుతున్నాయని అన్నారు. విద్య, వైద్యం, సామాజిక చైతన్యం లేక దుర్భరంగా ఉన్నారన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేయాలని పిలుపు నిచ్చారు. ఇందుకు దళిత, బహుజనులు ఏకమై ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు రాములు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు నర్సింలు, వెంకటయ్య, ఈశ్వరమ్మ, నర్సింలు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

డిగ్రీ కళాశాలకు రూ.11 కోట్లు

దేవరకద్ర: నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల మంజూరైందని.. ఈ విద్యా సంవత్సరం నుంచే జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు, అడ్మిషన్లు తీసుకుంటారని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కళాశాలకు రూ. 11 కోట్లు మంజూరైనట్లు వివరించారు. అదేవిధంగా అనువైన స్థలం చూసి నిర్మాణం చేపడతామన్నారు. అప్పటి వరకు జూనియర్ కళాశాలలో.. డిగ్రీ కళాశాలను కొనసాగిస్తామన్నారు. ఆదివారం తనక్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కళాశాల మంజూరుతో దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలతో పాటు చుట్టుపక్కల మండలాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. దశాబ్దాల కల నేరవేరిందని పేర్కొన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. దేవరకద్రలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కూడా త్వరలో చేపడతామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, కౌకుంట్ల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం...

రైతు రుణమాఫీ చేయడానికి నిర్ణయం తీసుకున్నందుకు దేవరకద్ర క్యాంపు కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో పాటు మండల నాయకులు పాలాభిషేకం చేశారు. రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఏక కాలంలో రూ. రెండు లక్షల రుణమాఫీని చేయడం దేశంలోనే మొదటి సారని అన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థితికి ఎదగాలి



ప్రతిభ పురస్కారాలతో ఎరుకల విద్యార్థులు

మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి ఎదగాలని టీఎస్‌పీఎస్సీ సభ్యుడు మోహన్‌రావు అన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీలలో ఉత్తమ మార్కులు సాధించిన ఎరుకల విద్యార్థులకు సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అంకిత (పదవ తరగతిలో 9.3 జీపీఏ), ఆనంద్‌కుమార్ (7.5 జీపీఏ), ఇంటర్మీడియట్‌లో అక్షయ (ఎంపీసీ– 834 మార్కులు), హారిక (ఎంపీసీ– 764), కె.నందిని (723), ఈ.స్వాతి (బైపీసీ–800) మార్కులు సాధించారని అన్నారు. వారితో పాటు డిగ్రీలో 825 మార్కులు సాధించిన శ్రీనివాసులుకు మెమొంటో, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. చదువుకోవడానికి ఏదైన ఆర్థికంగా ఇబ్బంది ఉంటే తనను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎరుకల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పర్వతాలు, రాష్ట్ర ఎరుకల సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ సదానందం, ప్రధాన కార్యదర్శి శంకర్, జ్ఞానేశ్వర్, ఆంజనేయులు, నర్సిములు, ఎం.బాలయ్య, హన్మంతు, రాములు, వెంకటస్వామి, మల్లయ్య, వసంత, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నవచండీ మహాయాగం



కలశాభిషేకం చేస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారం శ్రీ గిరిపీఠంపై నిర్వహిస్తున్న నవచండీ మహాయాగం ముగిసింది. నాలుగు రోజులుగా శ్రీ అంబాభవాని మందిరం నిర్వాహకులతో కలిసి శివానందస్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య యజ్ఞం , పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి. ఆదివారం అమ్మవారి ఆలయంలో కళస ఉద్వాసన, సామ్రాజ్య పట్టాభిషేకం చేపట్టారు.అనంతరం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన కార్యక్రమా కొనసాగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కిక్కిరిసిన మైసమ్మ ఆలయం

నవాబ్‌పేట: ఇటు మండల కేంద్రానికి.. అటు జిల్లాకేంద్రానికి అత్యంత సమీపంలో పిక్‌స్పాట్‌ను తలపించేలా.. ప్రకృతి సిద్ధమైన అడవిలో వెలసిన మైసమ్మ దేవత చెంత భక్తజన కోలాహలం కనిపించింది. ఆదివారం దాదాపు 30 వేల మంది వరకు భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో అడవి మొత్తం కిలోమీటర్ల పొడవునా జనసంచారం, రోడ్డుకు సైతం దాదాపు కిలోమీటర్ మేర వాహనాల రద్దీ కనిపించింది. దీందో ఎక్కడ చూసిన భక్తుల సందడితో అడవి తల్లి పులకించిపోయింది. భక్తులు పెద్దఎత్తున వస్తుండటంతో అధికారులకు వసతుల కల్పన తలకు మించిన భారంగా మారింది. ఈ మేరకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



మైసమ్మ అమ్మవారు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిన్నచింతకుంటలో ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు



కొల్లూర్‌లో..

నవాబుపేట: మండల పరిధిలోని కొల్లూర్ జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు (2010–2011) ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నాటి రోజులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించారు. వారిని ఘనంగా సన్మానించారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (1984–85 సంవత్సరంలో పదో తరగతి) చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దాదాపు 40 ఏళ్ల తరువాత అందరూ ఒకచోట చేరి నాటి రోజులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం వారికి విద్యను బోధించిన ఆనాటి గురువులకు శాలువాలు, పూలదండాలతో సత్కరించారు. నాటి గురువులు డేవిడ్, కురుమన్న, రఫీయొద్దీన్, గోపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, విద్యార్థులు వై. బాలేశ్వర్‌గుప్తా, జి.పిలోగు, రహిమత్, అబ్దుల్ హక్, పంతులు వెంకటయ్య, లలితతో పాటులు పలువురు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నారాయణపేట రూరల్: పట్టణంలోని సిటిజన్‌క్లబ్ ఆవరణలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేద పంచకర్మ ఎండీ వైద్యులు డాక్టర్ ఉమా, రవళి బృందం హాజరై నరాలకు సంబంధించిన వ్యాధులు, మోకాళ్లనొప్పులు, చర్మ వ్యాధులు, నడుమునొప్పి, కీళ్లవాతం, సొరియాసిస్, మెడనొప్పి తదితర దీర్ఘకాలిక వ్యాధులకు శాస్త్రీయ పద్ధతిలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 150 మందికి పరీక్షించిన వైద్య బృందం వారికి దినసరి ఆహార నియమాలు, జీవనశైలిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.

